క్లుప్తంగా

పట్టణ పీహెచ్‌సీ తనిఖీ



మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట : ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకట్రావు వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక 12వ వార్డు అంబేద్కర్ నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యకేంద్రాలలో మందుల కొరత ఉండొద్దని, ఓపీలు పెరగాలని సూచించారు. పలువురు రోగుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ వైద్యశాలలో పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య, ఫార్మాసిస్టు సంధ్య, ఏఎన్ఎం కృష్ణప్రియ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, అడ్వకేట్ కాకి రాంరెడ్డి తల్లి కోటమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కోటమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట ఆ పార్టీ నాయకులు మర్ల చంద్రారెడ్డి, సర్పంచ్ సానబోయిన రజిత సుధాకర్, ఎంపీటీసీ దామిడి మంజుల శ్రీనివాస్, బషీరుద్దిన్, కాకి మల్లా రెడ్డి, కానాల మల్లారెడ్డి, సుదగాని పాపయ్య, వీరబోయిన నాగయ్య, గోపాల్, మురళి, నవిలె పాపయ్య, సైదులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఆర్‌ను కలిసిన సామేలు

భానుపురి : మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనతో కాసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : గ్రామీణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మొబైల్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు వెంకెపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను ప్రారంభించి మాట్లాడారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, ఇమ్మారెడ్డి రాజాబహదూర్‌రెడ్డి, పీహెచ్ఎస్ తారమ్మ పాల్గొన్నారు.

కృష్ణమాచారికి సన్మానం

తిరుమలగిరి: సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన కందుకూరి కృష్ణమాచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కృష్ణమాచారిని సీనియర్ సిటిజన్ సంక్షేమసంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్, జిల్లా విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును నమోదు చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు
- కొనసాగుతున్న ప్రజాపాలన సభలు



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్



సూర్యాపేట రూరల్ : గ్రామసభలో పాల్గొన్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

చివ్వెంల : ప్రజాపాలన గ్రామసభల్లో ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. ప్రజా పాలనలో భాగంగా చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామ సభలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

సూర్యాపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం తాళ్ల ఖమ్మంపహాడ్, కాసరబాద, కేసారం, ఎర్కారం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ముదిరెడ్డి చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. గురువారం తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో తాటిపాముల గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిందని తెలిపారు. ఇక నుంచి ప్రజా అవసరాలు, ప్రభుత్వ అవసరాలకు మాత్రమే ఇసుకను తీయాలని, ఇసుక దోపిడీ అరికట్టాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కిరణ్‌కుమార్, సర్పంచ్ ఎర్ర శోభాశ్రీనివాస్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, పీఆర్ ఏఈ రవికుమార్, ఏపీఎం సైదయ్య, ఏఈఓ వెంకట్ రెడ్డి, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం కుక్కడం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పచ్చిపాల వెంకన్న, మాన్‌సింగ్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, సర్పంచ్ గుండ్ల కొమరయ్య, ఉప సర్పంచ్ బీసు పూలమ్మ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : రాష్ట్రంలో అన్ని వర్గాలను అభివృద్ధిపర్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, పీడీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఇందిర, ప్రత్యేక అధికారులు సుధాకర్‌రెడ్డి, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఆరు గ్యారంటీలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ కోరారు. గ్రామ పాలన కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గురువారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సంకేపల్లి జ్యోతినరోత్తమ్‌రెడ్డి, కొంపెల్లి రామ్మూర్తి గౌడ్, ఎండీ.షకీల్‌పాషా, రాజు, మున్సిపల్ సిబ్బంది ఖదీర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. సూర్యానాయక్‌తండాలో జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. అలాగే కోడూరులో కూడా గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రామారావునాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీఓ సందీప్, సర్పంచ్‌లు గుయ్యని బాబు, లునావత్ స్వాతిరవీందర్‌నాయక్, ఎంపీటీసీ బిక్కు నాయక్, కార్యదర్శులు జ్యోతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ దేశగాని పాపయ్యగౌడ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. గురువారం గానుగుబండ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే కొత్తగూడెం, గుడితండా, వెలుగుపల్లి గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్, ఏడీఏ జగ్గనాయక్, ఆర్ఐలు మహ్మద్‌అలీ, రవీందర్ రెడ్డి, గురువయ్య, ఏపీఎం నర్సయ్య, సర్పంచ్‌లు నల్లు రామచంద్రారెడ్డి, నకిరేకంటి విజయ్, మామిడి వెంకన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. గురువారం నర్సింహులగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జి.శోభారాణి, డీటీ షాహిన్‌బేగం, సర్పంచ్ ధరావత్ గణేష్, ఏపీఓ రవి, అంగన్‌వాడీలు, ఆశలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.వలీ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో గ్రామసభలు ముగియనుండడంతో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్.అక్బర్‌పాషా, షేక్.హుస్సేన్, అక్బర్, పాదిల లింగయ్య ఉన్నారు.

చివ్వెంల : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, సేవాలాల్ తండా, అక్కలదేవిగూడెం, బి.చందుపట్ల గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, ఎంపీఓ టి.గోపి, ఏపీఎం రాంబాబు, సర్పంచ్‌లు కలకొండ కరుణ, గుగులోతు కవిత, ఎంపీటీసీలు వేములపల్లి వాసుదేవరావు, కోడి బండ్లయ్య, నాయకులు ఎల్కపల్లి వెంకన్న, వీరబోయిన సైదులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : కుక్కడంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్



అర్వపల్లి : సూర్యానాయక్‌తండాలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ

గ్రామసభల తేదీల మార్పు

అర్వపల్లి : అడివెంల, బొల్లంపల్లి గ్రామాల్లో శనివారం జరగాల్సిన ప్రజాపాలన గ్రామసభలను శుక్రవారానికి మార్చినట్లు ప్రజాపాలన మండల టీం అధికారులు జక్కర్తి శ్రీనివాసులు, సందీప్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో నేడు గ్రామసభలు జరిపి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ నీలారాణి, వై.బి.శ్యామలత తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి ప్రవేశం కోసం ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

14న గోదాదేవి కల్యాణం



గోదాదేవి తలంబ్రాలతో భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు గురువారం పసుపు దంచి, తలంబ్రాలు సిద్ధం చేసే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అవినీతి చైర్మన్‌ను తొలగించాలి

నూతనకల్ : నూతనకల్ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ కనకటి వెంకన్న అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో బాధ్యతల నుంచి తొలగించాలని సంఘం డైరెక్టర్లు జిల్లా అధికారులను కోరారు. గురువారం సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘం అభివృద్ధి నిధులను సుమారు రూ. 40లక్షల మేరకు స్వాహా చేశారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలపై జిల్లా అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని వారు విమర్శించారు. గురువారం అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా చైర్మన్ స్టే తెచ్చుకున్నట్లు నోటీస్ బోర్డుపై అంటించారని తెలిపారు. ఇప్పటికైనా అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ సహకార సంఘం జిల్లా అధికారులతో పాటు కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సమ్మెట వెంకన్న, వైస్ చైర్మన్ నాగం జయసుధ, డైరెక్టర్‌లు తొట్ల లక్ష్మయ్య గౌడ్, ఏలేటి నారాయణరెడ్డి, పసుల వెంకన్న, కాసోజు మదనాచారి, కళమ్మ, గాజుల లింగయ్య, మట్టపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఇన్‌చార్జ్‌గా నియామకంపై హర్షం

అర్వపల్లి : భారతీయ కిసాన్ మోర్చా జాతీయ ఇన్‌చార్జ్‌గా ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ నియమితులు కావడం పట్ల గురువారం పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్, పీఎం విశ్వకర్మ యోజన వరంగల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కడియం కళ్యాణ్‌చందర్ ఉన్నారు.

శ్రీనివాసుడికి మంగళ నీరాజనాలు



మంగళహారతి పూజల్లో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం మహిళలు స్వామివారికి మంగళ నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యులు మాట్లాడారు. భగవంతుడి అనుగ్రహం పొందాలంటే మనలో ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించాలని తెలిపారు. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంకర్షణాచార్యులు, శ్రీహరి ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్టి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకుంటా



శివలింగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

మద్దిరాల : ప్రతి కార్యకర్తకు అండగా ఉండి ఆదుకుంటానని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. గోరెంట్లలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బత్తుల శ్రీనివాస్ సతీమణి సత్యవతి ఇటీవల మరణించడంతో గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు మెంబర్ సంగని మహేష్ కుమారుడు ఉమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రానికి చెందిన గూడ శివలింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అతడికి నివాళులర్పించారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెలుగు వీరయ్య ఇటీవల మరణించడంతో అతడి చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, కోడి శ్రీనివాస్, సూరినేని నర్సింహారావు, భూసాని ఉమామహేశ్వర్, సర్పంచ్ దామెర్ల వెంకన్న, వెలుగు వెంకన్న, ఇంతియాజ్‌ఖాతూన్, వడ్డాణం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బి.బాలునాయక్

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ అధి కారి వాసం ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పల్స వెంకన్న, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో..



పెన్‌పహాడ్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో..



తిరుమలగిరిలో..

తిరుమలగిరి : టీఎస్‌యూటీఎఫ్ 2024 క్యాలెండర్, డైరీలను గురువారం తిరుమలగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి వేసవిలో బడి బాట కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దామర శ్రీనివాస్, ఎస్.సోమయ్య, సీహెచ్.సోమయ్య, వీఎల్ఎన్.చారి, జానయ్య, ఎల్లయ్య, రవీందర్, వీరన్న, వెంకన్న, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, వెంకన్న, సైదులు, వీరస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని జెడ్పీహెచ్ఎస్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ బి.బాలునాయక్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి డి. యల్లయ్య, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, మండల అధ్యక్షుడు డి.యాదగిరి, సాటిక సుధాకర్, ఎల్.రాంసింగ్, బింగి శ్రీనివాస్, మధుసూదన్‌రావు, ఎం. ఉమ, మంజుల, సోమయ్య, మల్లయ్య, వరదాచార్యులు, రాము, కృష్ణారెడ్డి, సోముల వెంకటేశ్వర్లు, రేణుక, ధర్మయ్య, వైవీ రావు, కేశవరెడ్డి, నాగరాజు, కరుణ, సృజన తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

పెన్‌పహాడ్ : టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మైలారపు వెంకన్న, బండ్ల రమేష్‌లు గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రఫియా, సునీతాదేవి, మల్లేశ్వరి, కృష్ణయ్య, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాడలేని డ్రెయినేజీ వ్యవస్థ

- ఇళ్ల మధ్య పేరుకుపోతున్న మురుగు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



జగనాతండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

చివ్వెంల : మురుగు సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. ఎళ్లుగా గ్రామాల మధ్యలోనే మురుగు నిలిచి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి సంవత్సరం కాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు ఖర్చు పెడుతున్నా నిర్వహణ సరిగాలేకపోవడంతో మురుగు నీరు గ్రామాల వీధుల్లోనే దర్శనమిస్తోంది.

అధికారులకు విన్నవించినా..

పలు సందర్భాల్లో గ్రామాల్లో పర్యటించిన అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజలు డ్రెయినేజీల గురించి నిలదీస్తున్నారు. దీంతో అధికారులు స్పందించి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి వెళ్లిపోతున్నారు. కానీ తర్వాత పట్టించుకున్న దాఖలాలు ఉండడంలేదు. దీంతో ఎళ్ల తరబడి ప్రజలు దుర్వాసనతోపాటు దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగాల బారిన పడుతున్నారు.

చివ్వెంల మండల కేంద్రంలో..

చివ్వెంల మండల కేంద్రంలోని ప్రధాన వీధిలో మురుగు సమస్య ఎళ్ల తరబడి ఇబ్బందులకు గురిచేస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేకపోవడంతో మురుగు నీరు గ్రామం మధ్యలోనే నిలుస్తోంది. అలాగే తిమ్మాపురం, చందుపట్ల, దురాజ్‌పల్లి, కుడకుడ గ్రామాల్లో మురుగు నీరు ఆయా గ్రామాల వీధుల్లోనే పారుతోంది. దీంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా అపరిశుభ్రం వాతావరణం కారణంగా పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ప్రతి సంవత్సరం స్థానికులు పచ్చకామెర్లు, వాంతులు వీరేచాలతో అస్వస్థతకు గురవుతున్నారు. లక్ష్మణ్‌నాయక్‌తండా, వాల్యతండా, జగనాతండా, పాండ్యాభుక్యాతండా, పాశ్యానాయక్ తండా, రోళ్లబండతండా, జి.తిర్మలగిరి గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

గ్రామంలో మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల మధ్య మురుగు నీరు నిలుస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లి అనారోగ్యాల బారిన పడుతున్నాం. ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రమావత్ మంగ్తా నాయక్, రోళ్లబండ తండా

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



పస్తాల స్టేజీ వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

నాగారం : మండల పరిధిలోని పస్తాల స్టేజీ వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్తుల సహకారంతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు, తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర కార్యదర్శి బొజ్జ శ్రీధర్, సర్పంచ్ మల్యాల ఈశ్వరమ్మ, ఎంపీటీసీ బండగొర్ల నరేష్, ఉపసర్పంచ్ చిత్తలూరి రమేష్, బుక్క శ్రీను, వెంకన్న, వేణు, కండె అంజయ్య, వీరస్వామి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, బొజ్జ బజార్, మల్లయ్య, భిక్షమయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకుడికి సన్మానం



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్ర చేపట్టిన హర్యానా రాష్ట్ర వాసి అజయ్‌కుమార్‌కు గురువారం జాజిరెడ్డిగూడెంలో గ్రామస్తులు స్వాగతం పలికారు. గ్రామస్తులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, చింత నర్సింహులు రూ.1,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా అతడిని సన్మానించారు. కార్యక్రమంలో కుంభం సత్తయ్య, బింగి కృష్ణమూర్తి, దాసరి బాబూరావు, రింగు సత్యం, ఆకారపు శ్రీను, సత్తయ్య పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో వాటర్ ప్లాంట్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌కు రూ.లక్షతో మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేట్నేని శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు రేట్నేని వినోద్, హామిద్, తోట రమేష్, చెవిటి నర్సింహ, సూరి, సాయి, మహేష్, మనోజు, బొప్పని సంజీవ, స్వామి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వర్గానికే కేటాయించాలి

మద్దిరాల : బీసీ సామాజిక వర్గానికే భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్ అన్నారు. గురువారం కుక్కడం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ఎంపీ టికెట్‌ను కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.